స్వంత సంకల్పం అంటూ ఏమీ ఉండకూడదు. ఈశ్వరుడిని సంకల్పమే మీ సంకల్పం, ఈశ్వరుడి ఇష్టమే మీ ఇష్టం చేసుకోవాలి. మీకు అర్థం అయినా, అర్థం కాకపోయినా ఫలానా సంవత్సరంలో, ఫలానా రోజున, ఫలానా గంటలో మీరు ఇక్కడ కూర్చొన్నారు అంటే మీ తల్లి కడుపులో నుండి మీ దేహం బయటకు వచ్చినప్పడే అదినిర్ణయింపబడింది, ఈవేళ మీరు కొత్తగా ప్లాను వేసుకొని రాలేదు, అది ఈశ్వరసంకల్పం. నేను అరుణాచలం వచ్చి కొత్తగా పొందినది ఏదీ లేదు, నా దేహప్రారబ్ధంలో ఇక్కడ ఉండవలసి ఉంది అంతే అన్నారు భగవాన్. దేహాన్ని ప్రారబ్దానికి విడిచి పెట్టండి, ప్రారబ్ధం ప్రకారం దేహం నడుస్తుంది. మీరు ఆదేహంతోటి, ప్రారబ్దంతోటి తాదాప్యం పొందకండి, అటుచూడకండి, నాకు తెలియనిది ఏమీలేదు, నేను గొప్పవాడిని, నేనే తెలివైన వాడిని అనుకొంటే ఇంక నీవు ఈశ్వరుడికి శరణాగతి ఏమిపొందుతావు. నీకు భక్తుడుగా ఉండే అర్హత నాకు లేకపోతే, నీ భక్తుడికి భక్తుడిగా చెయ్యి అరుణాచలా అని భగవాన్ అక్షరమణమాలలో అంటారు. భగవంతుడి స్వరూపాన్ని ఎవడైతే పొందాడో వాడిచూపు చాలు మనకు జ్ఞానం కలగటానికి. మనం శివ, శివ అని నామం చేస్తున్నాము అనుకోండి శివుడు ఎంతటి వాడో, ఎంత శక్తి గలవాడో, ఎంత సర్వజ్ఞుడో ఆయన గొప్పతనం మనకు తెలియాలి అప్పడు మన మనస్సు అక్కడ నిలబడుతుంది. మన చుట్టాలందరికంటే భగవంతుడే మనకు పెద్ద చుట్టం ఆపెద్దచుట్టాన్ని మనం మర్చిపోయాము. ఎవడిని జ్ఞాపకం పెట్టుకోవాలో వాడిని మర్చిపోయాము ఈశరీరాలు అన్నీ నీడలు మనం భగవంతుడితో మానసిక అనుబంధం పెట్టుకోవాలి మన శరీరం ఎక్కడ ఉన్నా ఈశ్వరునితో మానసిక అనుబంధం పెట్టుకోండి మీరు ఏదో రకమైన సాధన చేయండి, అసలు మనస్సును లోపలకు పంపండి మనస్సును లోపలకు ఎలాపంపాలో ఆటెక్నిక్ మీకు తెలియాలి.

కర్మసిద్ధాతం గురించి పురాణాలలో ఒక కథఉంది. ఒక మనిషిని పాముకరిచింది అతను చనిపోయాడు ఒకడు ఆపామును పట్టుకొని ఆశవం దగ్గరకు తీసుకొని వచ్చాడు. పామును ఇక్కడ చంపుదామని తీసుకొని వచ్చాను అని చెప్పి పామును చంపడానికి సిద్ధమయ్యాడు. అప్పడు ఆపాము అంది నన్ను ఎందుకు చంపుతున్నావు. నన్ను ఎవడో లోపల ప్రేరేపించాడు, నేనుకరిచాను. నాకు వాడికి విరోధం ఏమీలేదు. నాకు కరవటమేపనా? చెట్లుమీద పాకుతున్నాను చెట్లను కరుస్తున్నానా? నాకు అనేకమంది కనిపిస్తున్నారు, వారిని కరుస్తున్నానా? ఆటైముకు కరవాలనిపించింది, కరిచాను, వాడుచనిపోయాడు. లోపల ఎవడో, యమధర్మరాజో ఆజ్ఞాపించాడు కరిచానుఅంది.



అప్పడు యమధర్మరాజును అడిగారు ఇంతమంది ఉన్నారుకదా వాడినే కరవమని ఎందుకు ప్రేరేపించావు అనిఅడిగారు. ఇందులో నాతప్ప ఏమీలేదు, ఇది కాలంయొక్క నిర్ణయం అనిచెప్పాడు అయితే కాలుడిని అడుగుదామని, ఎందుకు ఇలాచేసావు అని కాలుడిని అడిగారు. కాలుడు ఏమిచెప్పాడుఅంటే వీడిమీద నాకు అయిష్టం ఏమీలేదు, వీడుపూర్వజన్మలో చేసిన కర్మనుబట్టి ఫలానారోజున ఈపాముచేత కరవబడి చనిపోయే ప్రారబ్దంఉంది కాబట్టి చనిపోయాడు దానికి నేను ఏమిచేస్తాను అన్నాడు కాలుడు. వాడు పూర్వజన్మలో చేసిన దోషంవలన ఫలానా రోజున ఆపాముచేత చంపబడాలి అని నిర్ణయంవచ్చింది. అదికర్మసిద్ధాంతం. ఇప్పడు ఆటైముఅయ్యింది. మంచికర్మఅయినా, చెడుకర్మఅయినా ఫలితం రావటానికి కొంత టైముపడుతుంది. కాలప్రవాహంలో ఫలానారోజున పాముచేతకరవబడి చనిపోవాలి అని కర్మసిద్ధాంతం ప్రకారంనిర్ణయం అయిపోయిఉంది. అంతేగాని వాడిమీదనాకు ఏవిరోధంలేదు. అంటేవాడికర్మవాడిని చంపేసింది అంటేవాడు పూర్వజన్మలో చేసిన కర్మ ఈపరిస్థితిని తీసుకొనివచ్చింది. మాదోషం ఏమీలేదుఅంటూ కాలుడుతప్పకొన్నాడు, యముడు తప్పకొన్నాడు, పాము తప్పకొంది చివరకు ఎక్కడకు వచ్చిందిఅంటే వాడితప్పలకు వాడేకారణం అనిచెప్పారు. అందువలన మన విధికి మనమే కారణం. ఏదో పాముకారణం, అత్తగారు కారణం అనిఅనుకోవద్దు ఈమధ్య ఒక అత్తగారు అంది మాకోడలు తప్పఏమీలేదు. నాప్రారబ్దం ఆకోడలును మాఇంటికి తీసుకొచ్చింది. దేశంలో అనేకమంది స్త్రీలు ఉన్నారు, ఆవిడే మాకోడలుగా రావటం ఏమిటి? నాప్రారబ్దంప్రకారం ఆ అమ్మాయి మాకోడలుగా రావలసిఉంది, వచ్చింది. ఆ అమ్మాయి మంచిదా, చెడ్డదా అనేది అనవసరం ఆ అమ్మాయి మాకోడలుగా వచ్చిందికదా, ఆఅమ్మాయి నచ్చేటట్లుగా చేసుకోవాలి అదేసాధన అనిచెప్పింది.

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-11-02, ఆచంట

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉపాసన లేకుండా మోక్షంరాదు, జ్ఞానంరాదు. ఉపాసన అంటే మనం ఏదోఒక ఇష్టదేవతను తీసుకొని నిరంతరం మన మనస్సును వారి మీద కేంద్రీకృతం చేయటం వలన మన మనస్సు కరిగిపోయి అందులోలయమైపోతుంది. మీరందరూ సాధన పేరు మీద కష్టపడిపోవటంనాకిష్టంలేదు. మీరు ఫలితాలు ఆశించవద్దు, పరమేశ్వరుని మీద ప్రీతి పెంచుకోండి! ఆయన ఏదైనా ఇస్తేపుచ్చుకోండి, ఇవ్వకపోతే ఊరుకోండి కాని

అడగవద్దు. తేలికగా ఆత్మజ్ఞానం కలిగే ఉపాయాలు చెపుతున్నాను లోపల ప్రేమలేకుండా, లోపల శుద్ధి లేకుండా ఏదో బాహ్యప్రక్రియల వలన మనం ఈశ్వరుడిని మోసం చెయ్యలేము, ఆయన మన మనస్సును చూస్తూఉంటాడు. మన మనస్సుతో ఆయనను ఆరాధించగా ఆరాధించగా ఆయనకు మనకు అడ్డుగా ఉన్న మనస్సును ఆయనేతీసేస్తాడు. మీరు జీవితంలో ఒకటి నేర్చుకోండి. ఏపని చేసినా ఏదీ ఆశించవద్దు. వచ్చేది ఏదోవస్తుంది, రానిది ఏదోరాదు. ఆశించనంత మాత్రంచేత వచ్చేది ఆగదు. ఆశించినంత మాత్రాన ఎక్కువరాదు ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఈ ప్రకృతి, మాయ ఎప్పడు విడిచిపెట్టాలో అప్పడు విడిచిపెడతాయి, తొందరపడవద్దు, మోక్షంకూడా అడగవలసిన పనిలేదు. మనమనస్సు ఎప్పడు పక్కానికి వస్తుందో చూసుకొని మన హృదయంలో ఉన్న భగవంతుడే మనకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. పని పనికోసమే చేయండి, మాట మాటకోసమే మాట్లాడండి, భగవంతుడిని మనం ప్రేమించటంలోనే మనకు ఆనందం వచ్చేయాలి, ఆయన ఇవ్వటంకాదు ఇది బాగా గుర్తుపెట్టుకోండి, భగవంతుడిని పూజిస్తున్నాము, జపిస్తున్నాము ఆయన మనకు ఏదైనా ఇస్తాడో లేదో అని ఇలా మన భక్తి వ్యాపారం క్రింద ఉండకూడదు, వ్యాపారభక్తి పనికిరాదు, ఆయన ఇచ్చే వస్తువులు అన్నీ కాలప్రవాహములో కొట్టుకొని పోతాయి. మనం భగవంతుడిని వదిలేస్తున్నాము ఆయన ఇచ్చే వస్తువుల కోసం ఎదురుచూస్తున్నాము. మన శరీరం ఎంతకాలం ఉంటుంది. ఆయన ఇచ్చే వస్తువులు ఎంతకాలం ఉంటాయి అన్నీ కాల ప్రవాహములో కొట్టుకొని పోతాయి. ఆయన ఇస్తాడో, ఇవ్వడో అది ఆయన ఇష్టం, మీరు ఏదీ కోరుకోవద్దు, అది భక్తిఅంటే. మీరు అడగటం వలన ప్రశ్నించటం వలన భక్తి చెడిపోతుంది, శరణాగతి చెడిపోతుంది. భక్తి భక్తి కోసమే, ప్రేమ ప్రేమకోసమే, అడగటం అనేది మానేయండి. అడిగే అలవాటు పెరుగుతూ ఉంటే మనస్సు బలపడిపోతుంది. అడిగే అలవాటు మనం మానివేశాము అనుకోండి, మనకు ఏది అవసరమో, మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు కాబట్టి మన అవసరాలు అన్నీ ఇచ్చి చివరకు మోక్షం కూడా ప్రసాదిస్తాడు కాని మన దురదృష్టం ఏమిటి అంటే అడగకపోతే ఆయన ఏమీ ఇవ్వడేమో అని తొందరపడి అడిగేస్తాము. ఇలా అడగటం వలన మనస్సు కలుషితం అవుతుంది. నేను మీ ఇంటికి వస్తే మీరు కాఫీ ఇస్తే తీసుకోవచ్చు కాని మీరు కాఫీ ఇస్తారని నేను మీ ఇంటికి రాకూడదు. మీరు కాఫీ ఇస్తారని అనుకొని నేను మీ ఇంటికి వస్తే దానివలన మనస్సు కలుషితం అవుతుంది. జపంచేసేటప్పడే,



ధ్యానంచేసేటప్పడే మనకు ఆనందం వచ్చేయాలి మనం ఏదైనా పని చేస్తూ ఉంటే ఆపని చేసేటప్పడే మనకు ఆనందం కలగాలి. ఫలితంకోసం ఎదురు చూడకుండా ఉంటే ఆశించకుండా ఉంటే అప్పడు పని చేసేటప్పడు మనకు ఆనందం కలుగుతుంది. పనికూడా దేవుడే, పనిచేసేటప్పడు గుర్తింపులు లేకుండా చేయాలి. ఆత్మ గుర్తింపులు కోరదు, అహంకారం గుర్తింపులు కోరుతుంది. గుర్తింపులు కోరటం వలన అహంభావన పెరుగుతుంది. గుర్తింపుల వలన బాహ్యంగా మనం బాగుపడినట్లు కనబడినా మూలంలో నశిస్తాము. సొంత ఆలోచన విడిచిపెట్టవద్దు. సమాజంతో ఎటువంటి అనుబంధం ఉండాలి, ఎంతవరకు అనుబంధం ఉండాలి అనేది ముఖ్యం. చేసే స్నేహాల విషయంలో, చదివే పుస్తకాల విషయంలో, మాటలవిషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి.

భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీ చేతిలో ఉన్న పనిని వదిలేస్తున్నావు, నా చేతిలో ఉన్న పనిగురించి అస్తమాను ఆలోచిస్తున్నావు. దీనివలన కాలాన్ని పాడుచేసుకుంటున్నావు, శక్తిని వృధా చేసుకొంటున్నావు. నా చేతిలో ఉన్నపని ఎప్పడు చేయాలి, ఎక్కడ చేయాలి, ఎలాచేయాలి, ఏజన్మలో ఆకర్మఫలంతోటి అనుసంధానం పెట్టాలి ఇవన్నీ నేను చూసుకొంటాను. నీ చేతిలో ఉన్నపని జాగ్రత్తగాచెయ్యి అని భగవంతుడు చెపుతున్నాడు. నాకు భయం వేసి ఏదైనా మాట్లాడుతున్నాను అనుకోండి, ఇక్కడ భయం అనే వాడు నాకు టీచర్‌గా ఉన్నాడు. కాని దైవం నాకు టీచర్‌గా లేడు. భయం వలన నేను మాట్లాడుతూ ఉంటే అది నాకూ మంచిదికాదు, మీకూ మంచిది కాదు. మనం నేను, నేను అనేది దేహగతమైన నేను మనం జీవించటమే ఆనేను కోసం జీవిస్తున్నాము. మనం అంతర్దృష్టితో పరిశీలనచేసి చూస్తే అహంభావన కోసమే జీవిస్తున్నాము అని మనకి తెలుస్తుంది. మన గురించి మనకు అంచనా ఉండాలి. మనలో ఏబలహీనతలు ఉన్నాయి, మనం ఎంత వరకు అభివృద్ధి లోనికి వస్తున్నాము అనే పరిశీలన ఉండాలి, గాఢ నిద్రలో మనకు అహంవృత్తి లేదు అందువలన మనకు దేనితోటి తాదాప్యంలేదు, కాని మనం ఉన్నాము. అహంవృత్తి ఉదయించిన తరువాత దేహంతోటి, మనస్సుతోటి, ఇంద్రియాలతోటి తాదాప్యం పొందుతుంది, ఇలా తాదాప్యం పొందిన తరువాత నేను ఇలా ఉన్నాను, నేను అలా ఉన్నాను అనుకొంటుంది. ఇలా ఉన్నాను, అలా ఉన్నాను అనుకోవటం వలన అహంభావన పెరుగుతుంది, దేహభావన పెరుగుతుంది. మీరు అలాగ లేరు, ఇలాగ లేరు మీరు ఆత్మగానే ఉన్నారు అని భగవాన్ చెప్పారు. మీరు అలాగ ఉన్నాను, ఇలాగ ఉన్నాను

అని అనుకొంటే సత్యాన్ని విడిచిపెట్టి అసత్యం వైపు ప్రయాణం చేస్తున్నట్లు, వెలుగును వదలి చీకటిలోనికి వెళ్తున్నట్లు గుర్తు. గాఢనిద్రలో నుండి జాగ్రదవస్థలోనికి వచ్చేటప్పటికి సముద్రంలో బుడగలాగ నేను అనే తలంపు వస్తుంది. దానిని మనం పోగొట్టుకోవాలి. నేను అనే తలంపు పోతే మనం పోతాము అని అనుకొంటాము కాని మనంపోము బుడగపోతే అది సముద్రంలో ఎలాగ కలిసిపోతుందో అలాగ నేను అనే తలంపు పోతే మనం పోము, ఆత్మ అవుతాము. జాగ్రదవస్థలో మనం పనిచేసుకొంటాము, గాఢనిద్రలో మనం విశ్రాంతి తీసుకొంటాము, స్వప్నావస్థ ఎందుకు పనికిరానిది అనుకొంటాము కాని స్వప్నావస్థ మనకు గురువే. స్వప్నావస్థలో మనలోని బలహీనతలు మనకు తెలుస్తాయి అందుచేతనే భగవంతుడు స్వప్నావస్థను పెట్టాడు. స్మశానానికి వెళ్ళేవరకు ఎంతసేపు మనకు రెండే పనులు 1) దేహంతో తాదాప్యం 2) మనస్సుతో తాదాప్యం ఇవితప్ప ఇంకో పని మనకులేదు. ఈదేహము, మనస్సు రెండూ నిజంకాదు వీటితోనే తిరుగుతూ ఉంటే ఇంక మనకు సత్యం ఎలా తెలుస్తుంది. మీకు దేహంతో తాదాప్యం లేకపోతే అది పుట్టిన ఏమీ అనిపించదు, అదిచనిపోయినా ఏమీ అనిపించదు. మీకు మనస్సుతో తాదాప్యం లేకపోతే ఎవరైనా పొగిడినా మీకు ఏమీ అనిపించదు, ఎవరైనా విమర్శించినా ఏమీ అనిపించదు. గాఢనిద్ర మనకు గొప్ప గురువు. ఎందుచేతనంటే గాఢనిద్రలో మనం కానిదానిలో నుండి విడిపోతున్నాము, అక్కడ మనం మనంగా ఉంటున్నాము. మీరు భగవంతుడిని ఎలా స్మరించుకొంటున్నారో అలాగ ఎప్పడైనా గాఢనిద్రని స్మరించుకోండి. నీ హృదయంలో ఒక నేను ఉంది, అది దేనితోను తాదాప్యం పొందదు. అదిచేసాను, ఇది చేసాను అని ఏనేను అయితే అనుకొంటోందో ఆనేనును పోగొట్టుకోవటానికి శాస్త్రం సహకరిస్తుంది. మీ లోపల ఒక శుద్ధమైన, నిర్మలమైన నేను ఉంది, అది మీ కోసం ఎదురుచూస్తోంది అది ఎప్పడూ ఉంటుంది, ఉండటమే దానిపని. నువ్వు కానిదానిలో నుండి విడుదల పొందేవరకు ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తంకాదు. అది పరిశుద్ధంగా ఉంది, పరమపవిత్రంగా ఉంది, నిశ్చలంగా ఉంది దానికి ఆదిలేదు, మధ్యలేదు, అంతంలేదు అది నీవై ఉన్నావు అక్కడకు వెళ్ళటానికి గురువు నీకు సహాయ సహకారములు అందిస్తాడు, దానికి సహకరించకపోతే వాడు గురువు కాదు, వాడు రాక్షసుడు.

మనకు మంచితలంపులు, చెడుతలంపులు అనేకం వస్తూఉంటాయి. ఇవిఅన్నీ దేనికి వస్తున్నాయి. ఇవి అన్నీ నేను అనే మొదటి తలంపుకే వస్తున్నాయి. అదికూడా ఒక తలంపే, సంతోషం, దుఃఖం, వికారములు, జీవితం అంతా తలంపులే, నీలోపలఉన్న సత్యం తప్పించి మిగతావి అన్నీ చావుపుట్టుకలతోసహా, నీకష్టసుఖాలతో సహా అన్నీ మనస్సు కల్పించిన విషయములే ఇది నీవు తెలుసుకోవాలి. అసలు మనస్సు నీవు కాదు అంటారు భగవాన్. మనస్సే నీవు అయితే మరి గాఢనిద్రలో మనస్సుతో ఎందుకు వేరువడి పోతున్నావు. అంటే మనస్సు నీవుకాదు నీవుకాని మనస్సు చుట్టూ తిరగటం వలన నువ్వు మనస్సు అవ్వవు, అందువలన మనస్సు గొడవ వదిలెయ్యి. నేను అనే మొదటి తలంపును, మూలతలంపును మాట మాటకు ఉద్రేకపరచవద్దు, దానికి వికారములు రానివ్వకు, దానిని మచ్చిక చేసుకొని దానిమూలంలోనికి తీసుకొని వెళ్ళు. దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అప్పడు నీలోపల ఉన్నపరమాత్మ నీకు తానుగా వ్యక్తమవుతాడు, అది పరమస్థితి, అప్పడు ఎటు చూసినా ఆనందమే. అసలు మనస్సే లేదు అని భగవాన్ చెపుతున్నారు మరి మీకు మనస్సు ఉందా అని ఒకరు అడుగుతున్నారు. నాకు మనస్సు పోలేదు, ఉంది అది సాత్వికమనస్సు. దీనిని ఇంకా శుద్ధంచేస్తే, పరమ పవిత్రం చేస్తే అది ఆత్మగా రూపాంతరం చెందుతుంది. పరమపవిత్రమైన మనస్సు చూస్తుంది, అది చూసినా విషయాలతో కట్టుబడదు. పరమపవిత్రమైన మనస్సు ఎటువంటిది అని చెపుతారు అంటే కాలిపోయిన తాడు వంటిది. కాలిపోయిన తరువాత తాడు, తాడులాగానే కనబడుతుంది కాని అది కట్టటానికి పనికిరాదు అలాగే జ్ఞాని మనస్సుకూడా అంతే, సాత్వికమనస్సు, చైతన్యానికి దారి చూపించి అది తప్పకొంటుంది. సాధన ఎంతకాలం చేయాలి అని అడుగుతున్నారు. సాధన చేసేవాడు నీలోపల ఉన్నంతకాలం సాధన చేయవలసిందే, ప్రతిజన్మలోను చేస్తూనే ఉండాలి ఆచేసేవాడు పోయేంతవరకు సాధన చేస్తూనే ఉండాలి. సాధన చేసేవాడు నశిస్తే నీ సాధన పూర్తి అయినట్లే, మిమ్మల్ని చూడటానికి చాలమంది వస్తున్నారు, ఎందుకు వస్తున్నారు అని ప్రశ్న. ఆప్రశ్న నన్ను అడగవద్దు, చూడటానికి వచ్చిన వారిని అడగండి అని చెప్పాను. మూలతలంపును దాని మూలంలోనికి తీసుకొని వెళ్లమని మీరు చెపుతున్నారు ఇంత కంటే నిరంతరం భగవంతుడిని స్మరించుకోవటం మంచిది కదా అని ఒక భక్తుడు భగవాన్‌ను అడుగుతున్నాడు. రామ, కృష్ణ, శివాఅని భగవంతుడి నామాన్ని స్మరించుకోవటం విచారణామార్గంకంటే ఉత్తమమైనది ఏమో అని అడుగుతున్నాడు భగవంతుని నామాన్ని స్మరించుకోవటంలో ఒక సంతృప్తి ఉంటుంది, నేను నేను అంటే ఏమీ సంతృప్తి కనబడటం లేదు, గాలిలో దీపం పెట్టినట్లు ఉంది, భగవంతుని స్మరించుకొంటూ ఉంటే ఒక ఆలంబన

ఉంటుంది అంటున్నాడు దీనికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు ఏదోపద్ధతిలో వెడతానంటున్నావు. శివుడిని ప్రార్థించుకొంటాను అంటున్నావు అక్కడే వేరుభావన ప్రారంభమయ్యింది శివుడిని స్మరించుకో కాని శివుడు వేరు, నేనువేరు అని సద్వస్తువును రెండు ముక్కలు చేసేసావు. వేరుభావన లేకుండా పనిచేస్తే నీవుపనిచేసినా చెయ్యని వాడితో సమానము. వేరుభావనలో నుండే నీకు భయం కలుగుతుంది, కోరిక వస్తుంది ద్వేషంవస్తుంది. నీకువేరుభావన ఉన్నప్పడు శివుడిని స్మరించుకో నేను వద్దనటంలేదు. శివుడు వేరు, నువ్వువేరు అని సెపరేట్‌నెస్ నీకు వచ్చేసింది, అది నీవు గుర్తుపెట్టుకో, అలాఅని శివుడిని ఆరాధించవద్దు అనికాదు. నీమార్గంలో నీవు ప్రయాణం చెయ్యి నీకు నిజం తెలియకపోయినా ఏ శివుడినయితే ఆరాధిస్తున్నావో ఆయనకు నిజం తెలుసు. ఏదోజన్మలో నిజం దగ్గరకు ఆయన నిన్ను తీసుకొని వెళతాడు, అప్పటి వరకు నిన్ను విడిచిపెట్టడు. ఏది తెలిసిన తరువాత నీవు దుఃఖరహితుడవు, భయరహితుడవు, జన్మరహితుడవు అవుతావో ఆస్థితి ఏమిటో నీకు తెలియకపోయినా నీవు ఆరాధించే శివుడికి తెలుసు కాబట్టి ఆస్థితి నీకు తెలిసేవరకూ ఆయన నిన్ను వెంటాడుతూనే ఉంటాడు. అవసరమైతే మానవరూపం ధరించి, ఈ శరీరం అనే చొక్కా వేసుకొని, నీకు బోధించటం కోసం వస్తాడు ఆయనే శివుడు. మనం విష్ణువుని అలంకరించినా, శివుడిని అభిషేకించినా, కుమారస్వామిని దర్శించినా మనకోసమే మనం చేసుకొంటున్నాము, మనం పవిత్రులం అవ్వటం కోసమే చేస్తున్నాము. శివుడిని ఆరాధించటం మాట అటుఉంచండి, మీరు వేదంలో చెప్పిన మాటలు చెప్పటం లేదు అని అడుగుతున్నారు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే అహంబ్రహ్మాస్మి నేను బ్రహ్మమునై ఉన్నాను అని వేదంలో చెప్పిన మాట నిజమే. నేను బ్రహ్మమునై ఉన్నాను అని అనుకొనే వాడు ఎవడు? బ్రహ్మమునేను అని అనదు, నేను బ్రహ్మమును అనుకొనే ఈ నేను ఎవరు? అదికూడా ఒక తలంపే, దానిని తీసి ఒక ప్రక్కన పెట్టు. ఇటునుండి అటుచెప్పినా, అటునుండి ఇటుచెప్పినా ఉన్నది ఒక్కటే.

నీకు ఒక రూపంఉంది ఆ రూపం మటుకు నీవు కాదు, నీకు ఒక శరీరం ఉంది ఆశరీరం మటుకు నీవు కాదు, నీకు ఒక మనస్సు ఉంది ఆమనస్సు నువ్వుకాదు, నీకు ఒక ఇల్లు ఉంది ఆఇల్లు మటుకు నీవు కాదు, నీకు ఒక గ్రామం ఉంది ఆ గ్రామం నీవు కాదు, నీకు ఒక పేరు ఉంది ఆపేరు మటుకు నీవుకాదు, ఇవి ఏమీ నీవు కాదు నువ్వు ఏదిగా ఉన్నావో దానిమీద నీమనస్సును నిలబెట్టటమే నిజమైన సాధన మిగిలినవి అన్నీ సాధనలలాగ కనిపించే సాధనలు. వాటి వలన పుట్టమీద దెబ్బలు తగులుతాయి కాని పుట్టలో ఉన్న పాము మీద దెబ్బలు తగలవు. పుట్టను కొట్టటం వలన పాము చనిపోదు, పుట్టలో ఉన్నపామును కొట్టటం వలన మాత్రమే పాము చనిపోతుంది. ఉన్నది ఒక్కటే, ఒక్కటి అంటే ఒక్కటే, నీమనస్సును అక్కడ నిలబెట్టు. అక్కడ నిలబెడితే కొంతకాలానికి మనస్సును ఎక్కడయితే నిలబెడుతున్నావో అది నువ్వు అన్న సంగతి నీకు తెలుస్తుంది, మనస్సు నశించిన తరువాత అది నీకు తెలుస్తుంది. నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక అనుభవం పొందటానికి నీవు చేతులతో పనిచేసుకో, మనస్సులో నిర్మలంగా ఉండు, నిశ్చలంగా ఉండు, నిరాడంబరంగా ఉండు, ఏకంగా ఉండు, శాంతిగా ఉండు. భక్తి పేరు చెప్పి నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలి గాని ఆడంబరంగా, ఆందోళనగా ఉండకూడదు. చూపులో నిర్మలత్వం, మాటలో నిర్మలత్వం, మనస్సులో నిర్మలత్వం ఉండాలి. మీపని మీరు శ్రద్ధగా చేసుకోండి, పని విడిచిపెట్టి పారిపోవద్దు. మీ ప్రారబ్ధమును బట్టి మీకు పరిస్థితులు అనుకూలంగా ఉండవచ్చు, ప్రతికూలంగా ఉండవచ్చు. మీరు మాత్రం భగవంతుడిమీద భారంవేసి మీపని ఏదో మీరు జాగ్రత్తగా చేసుకొంటూ, సోమరితనానికి అలవాటు పడకుండా నిర్మలంగా ఉండి, నిశ్చలంగాఉండి మీ హృదయంలో ఏదో ఉంది అంటున్నారు కదా అది ఎవరోకాదు అది మీరే అన్నసంగతి అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నంచెయ్యండి.

20-10-2002

రమణ భాస్కర